అక్కినేని అఖిల్ నిశ్చితార్థం

యువ హీరో అక్కినేని అఖిల్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. ఆయన నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, అగ్ర నటుడు నాగార్జున మంగళవారం తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిశ్చితార్థ వేడుకను నిర్వహించినట్లు తెలిసింది. పారిశ్రామికవేత్త జుల్ఫీ రవ్జీ కుమార్తె అయిన జైనబ్ రవ్జీకి చిత్రకారిణిగా మంచి పేరుంది. ఆమె తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున మధ్య కొన్నేళ్లుగా చక్కటి స్నేహసంబంధాలు ఉన్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా డిసెంబర్ 4న నాగచైతన్య-శోభితా ధూళిపాళ్ల వివాహం జరగబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అక్కినేని ఫ్యామిలీ వివాహ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అఖిల్ ఎంగేజ్‌మెంట్ జరిగిపోవడంతో అభిమానులు హ్యాపీగా ఫీలవుతున్నారు. అఖిల్, జైనబ్ రవ్జీ జంటకు పలువురు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలందజేశారు.

బ్రేకప్ తర్వాత గెలిచే ప్రేమ

సిద్ధార్థ్, ఆషిక రంగనాథ్ జంటగా నటించిన చిత్రం 'మిస్ యు'. ఎన్.రాజశేఖర్ దర్శకుడు. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్నది. ఇటీవల ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ మాట్లాడుతూ 'దర్శకుడు కథ చెప్పినప్పుడు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఓ క్యూట్ లవ్‌స్టోరీగా మెప్పిస్తుంది. సంగీతభరిత ప్రేమకథగా ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు కూడా గొప్పగా ఉన్నాయి. ఈ సినిమా తర్వాత నాకు మరిన్ని లవ్‌స్టోరీస్‌లో అవకాశాలు వస్తాయనుకుంటున్నా' అన్నారు. బ్రేకప్ తర్వాత కూడా ప్రేమ ఎంత బలంగా మారుతుందో అనే అంశాన్ని ఈ సినిమాలో భావోద్వేగభరితంగా ఆవిష్కరించామని, విజువల్స్‌తో పాటు జిబ్రాన్ సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రేమలో సెకండ్ ఛాన్స్ ఉంటే ఎలా ఉంటుందనే అంశాన్ని ఈ సినిమాలో గొప్పగా చూపించారని చిత్ర బృందం పేర్కొంది.

స్ఫూర్తినిచ్చే ఝాన్సీ ఐపీఎస్

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో తమిళంలో విజయం సాధించిన 'ఝాన్సీ ఐపీఎస్' చిత్రం తెలుగులో రానుంది. గురుప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆర్‌కే ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌కే గౌడ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 29న విడుదలకానుంది. సోమవారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు ప్రముఖ నిర్మాణ ఏఎం రత్నం, సీనియర్ నటుడు సుమన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ..నేటి మహిళలు మరింతగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి రావాల్సిన అవసరం ఉందని, ఈ సినిమా వారికి స్ఫూర్తినిస్తుందని చెప్పారు. తాను నిర్మించిన 'కర్తవ్యం' సినిమా మహిళలు పోలీస్ శాఖలోకి రావడానికి ప్రేరణ నిచ్చిందని, అదే తరహాలో ఝాన్సీ ఐపీఎస్ ఆకట్టుకుంటుందని ఏఎం రత్నం పేర్కొన్నారు. ఈ సినిమాలో లక్ష్మీరాయ్ నటన హైలైట్‌గా నిలుస్తుందని, ముఖ్యంగా పోరాటఘట్టాలు థ్రిల్‌ని పంచుతాయని, త్వరలో మహిళా కబడ్డీ జట్టు అనే సినిమా చేయబోతున్నామని నిర్మాత ఆర్‌కే గౌడ్ తెలిపారు.

అబద్ధాలు కాబట్టే స్పందించలేదు

సమంత మాటల్లో ఆత్మాభిమానం అడుగడుగునా గోచరిస్తూ ఉంటుంది. 'జీవితంలో ఎదురైన ప్రతి అనుభవాన్నీ పాఠంలా తీసుకొని పరిపూర్ణమైన మనిషిని అయ్యాను' అంటున్నది నటి సమంత. ఇటీవల తన జీవితంలో ఎదురైన క్లిష్టపరిస్థితుల గురించి మాట్లాడుతూ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించిందామె. 'విడాకులు అనే విషయాన్ని సమాజం ఎందుకు ఇలా భూతద్దంలో చూస్తుందో అర్థం కాదు. పైగా ఈ విషయంలో స్త్రీకి జరుగుతున్న డ్యామేజీ పురుషుడికి జరగడం లేదు. డీవోర్స్ తీసుకున్నది అనగానే ఆమెకు సమాజం కొన్ని ట్యాగ్స్ తగిలించేస్తుంది. సెకెండ్ హ్యాండ్, యూజ్డ్.. ఇలా ఆమె జీవితం వృథా అన్నట్టు మాట్లాడతారు. మీడియా కూడా ఈ విషయాన్ని ప్రత్యేకంగా ఎత్తి చూపుతూ ఉంటుంది. ఇలాంటివి చూసినప్పుడల్లా మనుషులు కంటే పశువులే నయం అనిపిస్తుంటుంది. ఇలాంటి కామెంట్స్ ఆ స్త్రీని, ఆమె కుటుంబాన్నీ ఎంత బాధిస్తాయో వాళ్లకర్థం కాదు. నా గురించి ఎన్నో అవాస్తవాలు ప్రచారం చేశారు. అవన్నీ అబద్ధాలు కాబట్టే వాటిపై స్పందించలేదు. నా స్నేహితులకు, నా కుటుంబ సభ్యులకు నేనేంటో తెలుసు. వారి మద్దతే నన్ను నిలబెట్టింది.' అంటూ చెప్పుకొచ్చింది సమంత.

రెండు సినిమాలను పూర్తి చేసే దిశగా

పాలిటిక్స్‌లో బిజీ కావడం వల్ల షూటింగులకు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు పవన్‌కల్యాణ్. ప్రస్తుతం హరిహర వీరమల్లు, ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు ఆయన చేతిలో ఉన్నాయి. వీటిలో వీరమల్లు, ఓజీ సినిమాల షూటింగులు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. పవన్ ఇంకొన్ని రోజులు డేట్స్ ఇస్తే ఆ సినిమా షూటింగ్‌లు పూర్తయిపోతాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ నెల 28 నుంచి 'హరిహర వీరమల్లు' షూటింగ్ మొదలవ్వనుందని తెలుస్తున్నది. డిసెంబర్ మొదటివారం వరకూ అంటే, దాదాపు పదిరోజులు ఈ సినిమా షూటింగ్‌లో పవన్ పాల్గొననున్నారట. దీనికోసం విజయవాడ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లను కూడా ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఇక 'ఓజీ' విషయానికొస్తే.. డిసెంబర్ నెలలోనే ఈ సినిమా బ్యాంకాక్ షెడ్యూల్‌ని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అక్కడ తీసే యాక్షన్ షూట్‌తో 'ఓజీ'లో పవన్ పార్ట్ పూర్తవుతుందట. మొత్తానికి ఈ రెండు సినిమాకూ మోక్షాన్నిచ్చే దిశగా పవన్ అడుగులేస్తున్నారని వినికిడి.

ఫ్లాష్‌బ్యాక్ గెటప్‌కోసం కసరత్తులు

విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'జెర్సీ' దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'VD12' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చేసే సినిమాపై తాజా వార్త ఒకటి వినిపిస్తున్నది. ఈ సినిమా 1854-78 మధ్య కాలంలో జరిగే పిరియాడిక్ డ్రామా అని అందరికీ తెలిసిందే. అయితే.. ఈ కథలో ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. ఆ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ గెటప్‌ని విభిన్నంగా ప్లాన్ చేశారట దర్శకుడు రాహుల్ సంకృత్యన్. దీనికోసం ప్రత్యేకంగా స్కెచెస్ కూడా వేయిస్తున్నారట. ఈ ఎపిసోడ్ కథకు కీలకం కావడంతో ఇప్పట్నుంచే రాహుల్ సంకృత్యాన్ ఈ గెటప్‌పై కసరత్తులు మొదలుపెట్టారని ఇన్‌సైడ్ టాక్. వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది. నానితో రాహుల్ సంకృత్యాన్ చేసిన 'శ్యామ్ సింగరాయ్' సినిమా ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఆ సినిమాను మించేలా ఈ సినిమా కథను రాహుల్ సంకృత్యాన్ తయారు చేశారని, హాలీవుడ్ నటుడు అర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నారని వార్తలొస్తున్నాయి. ఇందులో నిజానిజాలు తెలియాంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

సినీ గేయ రచయిత కులశేఖర్ కన్నుమూత

ప్రముఖ సినీగేయరచయిత కులశేఖర్(53) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆయన తుదిశ్వాస విడిచారు. కులశేఖర్ జన్మస్థలం విశాఖ జిల్లా సింహాచలం. ఓ ప్రముఖ మీడియా సంస్థలో విలేకరిగా ఆయన కెరీర్ మొదలైంది. అనంతరం చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, ఆర్పీ పట్నాయక్ స్వరపరిచిన చాలా పాటలకు సాహిత్యాన్ని అందించారు. తేజా దర్శకత్వంలో వచ్చిన 'చిత్రం' ఆయనకు తొలి బ్రేక్‌ని ఇచ్చింది. ఆ తర్వాత జయం, ఔనన్నా కాదన్నా, వసంతం, ఘర్షణ, సుబ్బు.. ఇలా చాలా సినిమాకు కులశేఖర్ పాటలు రాశారు. 'గాజువాక పిల్లా మేం గాజులోళ్లం కాదా..', 'రాను రాను అంటూనే చిన్నదో..', 'అందమైన మనసులో ఇంత అలజడెందుకో..' సాంగ్స్ ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. కులశేఖర్ మరణం తెలుగు సినిమా సాహిత్యానికి తీరని లోటు అని పలువురు చిత్ర ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

లుక్ ఇస్తే చాలే..

నితిన్, శ్రీలీల జంటగా రూపొందుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. ప్రతిష్టాత్మ మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ వేగవంతం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఈ సినిమాలోని తొలిపాటను విడుదల చేశారు. 'లుక్ ఇస్తే చాలే జానూ.. లక్కీగా ఫీలవుతాను.. కిక్కొచ్చే టచ్ ఇస్తావా వన్‌మోర్ టైమ్.. వన్‌మోర్ టైమ్..' అంటూ సాగే ఈ పాటను కృష్ణకాంత్ రాయగా, జీవి ప్రకాష్‌కుమార్ స్వరపరిచి, విద్యా వోక్స్‌తో కలిసి ఆలపించారు. ప్రేమకోసం గర్ల్‌ఫ్రెండ్‌ని మరో అవకాశం కోరుతూ హీరో పాడే పాట ఇదని, హీరోలోని నిజాయితీని మెచ్చుకుంటూనే, కాస్త జాగ్రత్తగా ఉండమని హీరోయిన్ హెచ్చరించడం ఈ పాటలో ప్రత్యేకత అని, నితిన్, శ్రీలీల అద్భుతమైన కెమిస్ట్రీ, అట్రాక్టివ్ డ్యాన్స్ మూమెంట్స్ ఈ పాటలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్.

భయపెట్టే థ్రిల్లర్

వేదిక లీడ్ రోల్ చేస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. డా.హరిత గోగినేని ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. డా.వంకి పెంచెలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. విడుదలకు ముందే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా ఈ సినిమా అవార్డులను గెలుచుకున్నదని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా సినిమాను విడుదల చేస్తున్నామని, ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. అరవింద్ కృష్ణ, జయప్రకాష్, పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సయాజీ షిండే, సత్యకృష్ణ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ.ఆండ్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాత: సుజాత రెడ్డి.

నాలుగు ప్రేమకథల సమాహారం

'ఫ్రెండ్షిప్ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ఇది. ఇందులో నాలుగు ప్రేమకథలుంటాయి. నలుగురు అబ్బాయిల జీవితాల్లోకి నలుగురు అమ్మాయిలు వచ్చిన తర్వాత వాళ్లల్లో వచ్చిన మార్పేంటి? అనేదే ఈ సినిమా. అన్ని ఉద్వేగాలూ మిక్స్ అయిన పర్‌ఫెక్ట్ ఎంటర్టైనర్ ఇది. పదిహేను నిమిషాల పతాక సన్నివేశం మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది.' అని దర్శకుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రధారులు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విక్రమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'నా ఫ్రెండ్ లైఫ్‌లో జరిగిన కొన్ని ఇన్సిడెంట్స్‌ని ప్రేరణగా తీసుకొని ఈ కథ తయారు చేశాను. సినిమా చాలా నాచురల్‌గా, వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. అయితే.. శృతిమించిన రొమాన్స్ మాత్రం ఉండదు. యువతరం ఓ రేంజ్‌లో ఎంజాయ్ చేసే సినిమా ఇది.' అని ఆయన చెప్పారు.

ఉక్కు ఉద్యమ చిత్రం

విశాఖ ఉక్కు తెలుగువారి హక్కు నినాదంతో సత్యారెడ్డి రూపొందించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 'విప్లవకవి కవి గద్దర్ నటించిన ఆఖరు చిత్రం ఇది. ఎంతోమంది ఉద్యమకారులను దృష్టిలోపెట్టుకొని ఈ సినిమా కథానాయకుని పాత్రను గద్దరే తీర్చిదిద్దారు. నిజజీవితానికి దగ్గరగా ఉండే ఉద్యమ చిత్రం ఇది' అని దర్శక, నిర్మాత సత్యారెడ్డి తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నేపథ్యంలో జరుగుతున్న ఉద్యమాన్ని కళ్లకు కట్టేలా ఈ సినిమా చూపించారని మాజీ సీబీఐ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇంకా గద్దర్ కుమార్తె వెన్నెల కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పల్సర్‌బైక్ ఝాన్సీ, ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎం.వి.వి.సత్యనారాయణ, ప్రసన్నకుమార్, వెన్నెల తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీకోటి.